క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్, కోటగిరి తెల్ల రవన్న యువసేన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వంద మంది మహిళలకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కంటి వైద్యులు సతీష్, వార్డు మాజీ సభ్యులు అరుణ్ కుమార్ గౌడ్, బీడీ కార్మిక సంఘం నాయకురాలు శకుంతల, లయన్స్ క్లబ్ ప్రతినిధులు హన్మంత్‌రావు పటేల్, కప్ప సంతోష్ తదితరులు పాల్గొన్నారు

కంప్యూటర్, బెంచీల వితరణ

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో 1998–99 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు కంప్యూటర్, బెంచీలను అందజేశారు. బుధవారం పాఠశాలలో హెచ్ఎం రాజేంద్ర కుమార్‌కు అప్పగించారు. పూర్వ విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.

డిపాజిట్ లేకుండా బస్సుల బుకింగ్

ఆర్మూర్‌టౌన్: శ్రావణమాసం సందర్భంగా వివాహాలకు, శుభ కార్యాలకు ఆర్టీసీ బస్సు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించిందని డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. శ్రావణ మాసంలో 10 శాతం రాయితీతో పాటు ఎలాంటి డిపాజిట్ లేకుండా బస్సులు బుక్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆర్మూర్, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘పాలన గాలికి వదిలేశారు’

ఆర్మూర్: మున్సిపాల్ పాలకవర్గ సభ్యులు పాలనను పూర్తిగా గాలికి వదిలేశారని సీపీఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు విమర్శించారు. ఆర్మూర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్మూర్‌లో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా మున్సిపల్, ఆరోగ్య శాఖాధికారులు సర్వేలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, మురికి నీరు లేకుండా చూడాలన్నారు.

న్యాయవాదుల నిరసన



ఆర్మూర్‌టౌన్: జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని నిరసిస్తూ ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసనను వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన పోలీసులను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నరసయ్య, శంకర్, ఆవారి రమేష్, జక్కుల శ్రీధర్, న్యాయవాదులు పాల్గొన్నారు

పర్మినెంట్ చేయాలి

ఆర్మూర్: రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూమన్న, దాసులు డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చే యాలన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలన్నారు. నాయకులు సూర్య శివాజీ, జేపీ గంగాధర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరులో మండల స్థాయి క్రీడలు

పెర్కిట్(ఆర్మూర్): ఈ నెలాఖరులో ఆర్మూర్ అర్బన్, రూరల్ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంఈవో రాజ గంగారాం తెలిపారు. ఆర్మూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం క్రీడలపై హెచ్ఎంలు, పీడీ, పీఈటీలతో ఎంఈవో సమావేశం నిర్వహించారు. సమావేశంలో క్రీడల ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం ఆర్మూర్ మండలానికి పదోన్నతులపై వచ్చిన పీడీ, పీఈటీలను ఈ సందర్భంగా ఎంఈవో ఘనంగా సన్మానించారు. హెచ్ఎంలు కవిత, రవీందర్, హరిత, నారాయణ, చేతన కుమారి, విశ్వనాథ్, జగదీష్, పీడీలు మల్లేష్ గౌడ్, గోపి, గంగాధర్, మధు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



డొంకేశ్వర్(ఆర్మూర్): పీఆర్‌టీయూ డొంకేశ్వర్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్వసభ్య సమావేశం నిర్వహించి ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా నరేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రామారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా రాజేశ్వర్, మహిళా ఉపాధ్యక్షులుగా నవనీత, సెక్రెటరీగా మోహన్ ఎన్నికయ్యారు. ఎన్నికై న వారికి జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్ సన్మానించి అభినందించారు.

నోటీసులిచ్చినా లెక్కలేదు!

- వంతెన నిర్మాణానికి ముందుకురాని కాంట్రాక్టర్
- ఎనిమిది నెలల క్రితమే పూర్తయిన టెండర్లు, అగ్రిమెంట్
- రూ.75 లక్షలు మంజూరు చేసిన గత ప్రభుత్వం



నికాల్‌పూర్‌లో వంతెన నిర్మించేది ఇక్కడే

డొంకేశ్వర్: మండలంలోని నికాల్‌పూర్ వద్ద నిర్మించే వంతెన పనులు టెండర్‌కే పరిమితమయ్యాయి. ఎనిమిది నెలల క్రితం టెండర్లు పూర్తికాగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ముఖం చాటేశాడు. ఆర్ అండ్‌బీ అధికారులు నోటీసులిచ్చినా లెక్క చేయడం లేదు. నికాల్‌పూర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు మధ్యలో కెనాల్ ఉంది. కల్వర్టు చిన్నదిగా ఉండటంతో వాహనాల రాకపోకలతో పాటు కెనాల్ నీళ్లు ప్రవహించేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఇక్కడ వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వంతెన కోసం ప్రభుత్వం రూ.75 లక్షలు మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో గతేడాది డిసెంబర్‌లో వంతెనను నిర్మించడానికి అధికారులు టెండర్లు నిర్వహించారు. పనులు చేపట్టేందుకు ఓ కాంట్రాక్టర్ టెండరును దక్కించుకున్నారు. ఆయనతో అగ్రిమెంట్ సైతం పూర్తయింది. వంతెన నిర్మించే చోట ఆరు నెలల క్రితం అప్రోచ్ రోడ్డును వేశారు. మిగతా పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. అయితే కాంట్రాక్టర్ గతంలో వేరే ప్రాంతంలో చేపట్టిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదనే కారణంతో నికాల్‌పూర్ వంతెన పనులను ప్రారంభించడం లేదని తెలుస్తోంది. అందుకే ఆర్‌అండ్‌బీ అధికారులు నోటీసులిచ్చినా గుత్తేదారు లెక్కచేయడం లేదని సమాచారం. ఆర్‌అండ్‌బీ ఏఈ రఘుని ‘సాక్షి’ వివరణ కోరగా, నోటీసులిచ్చినా విషయం వాస్తవమేనని, కాంట్రాక్టర్ స్పందించకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

త్వరగా నిర్మించాలి



గ్రామానికి రాకపోకలు, కెనాల్ పారకం ఇబ్బందులు తొలగాలంటే వంతెన నిర్మించాలి. ఆలస్యమైతే వచ్చిన నిధులు వెనక్కి వెళ్తాయి. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా వంతెన పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి. – గడ్డం సంతోష్ రెడ్డి, నికాల్‌పూర్

ప్రభుత్వ భూములను ఆక్రమించడం నేరం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టపరంగా నేరమని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో అక్కడ హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. బీజేపీ నాయకులు కంచెట్టి గంగాధర్, ద్యాగ ఉదయ్, జెస్సు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని ఎంఆర్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు నర్సింహ నాయుడు ఆధ్వర్యంలో గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. అసెంబ్లీ సమావేశాల్లో గల్ఫ్ కార్మికుల కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వచ్చినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడలు వంచి అయినా గల్ఫ్ కార్మికుల కష్టాలను తీరుస్తామని హామీ ఇచ్చారు.

అర్హులందరికి చేయూతను అందించాలి



రెంజల్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

రెంజల్(బోధన్): అర్హులైన ప్రతి బీడీ కార్మికుడికి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం చేయూతను అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎంపీడీవో కార్యాయలం ముందు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రెంజల్ బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాయలం వరకు ర్యాలీ తీశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె నరేందర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా ఎలాంటి షరతులు, ఆంక్షలు లేకుండా రూ. 4వేల జీవనభృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..

డొంకేశ్వర్(ఆర్మూర్): చేయూత పథకం కింద రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు బుధవారం డొంకేశ్వర్ తహసీల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ... బీడీ కార్మికులకు 8 నుంచి 12 రోజులు మాత్రమే పని లభిస్తోందని, తద్వారా వారికి కుటుంబ పోషణ భారమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్లకోసారి కనీస వేతన చట్టాన్ని సవరించాలని, రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు పింఛన్లు పెంచాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న బీడీ కార్మికులందరికీ పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్



హాసాకొత్తూర్‌లో వీధులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

కమ్మర్‌పల్లి: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన హాసాకొత్తూర్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పర్యటించి పారిశుద్య పనులను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అనంతరం క్రీడా ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఎంపీవో సదాశివ్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, జీపీ కార్యదర్శి నర్సయ్య తదితరులు ఉన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాక్లూర్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఇన్‌చార్జి ఎస్సై గంగాధర్, విద్యార్థులకు సూచించారు. నిజామాబాద్ పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితమే కోల్పోవాల్సి వస్తుందన్నారు. కళాబృందం కానిస్టేబుళ్లు బాషా, విక్రమ్, శేఖర్, సీత, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలి



బోధన్: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టాన్ని తీసుకు రావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎం. గంగాధర్ అప్ప అధ్యక్షతన సంఘం జిల్లా కమిటీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం 14 రకాల పంటలకు నామ మాత్రంగా మద్దతు ధర పెంచిందన్నారు. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని పేర్కొన్నారు. నాయకులు భూమేశ్వర్, గంగామణి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

10న పీవోడబ్ల్యూ మహాసభ

మాక్లూర్: మహిళల హక్కుల సాధన కోసం భవిషత్తులో తీసుకునే నిర్ణయాలను రూపొందించుకునేందుకు ఈ నెల 10న 7వ మహాసభలు జరుగుతాయని పీవోడబ్ల్యూ నిజామాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి డి.రాధ వెల్లడించారు. బుధవారం బోర్గాం(కె)లో ఆమె మాట్లాడారు. 7వ మహాసభలు నిజామాబాద్ నగర న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో జరుగుతాయన్నారు.

స్పందించకపోతే ఎర్రజెండాలు పాతుతాం

వర్ని(చందూర్): మండల కేంద్రంలో 17 ఏళ్ల క్రితం ప్రభుత్వం పట్టాలిచ్చిందని, స్థలం చూపెట్టకుండా ప్రభుత్వం, అధికారులు ఇళ్లు లేని నిరుపేదలను మోసం చేస్తున్నారని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ఆరోపించారు. బుధవారం చందూర్ మండల కేంద్రంలోని మర్రి బొగడకాలనీలో ప్రభుత్వ స్థలాన్ని సీపీఎం నాయకులు, గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. నన్నేసాబ్ మాట్లాడుతూ.. 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం సుమారు 110 మంది ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు 15 రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే తామే ఎర్రజెండాలు పాతి, ఇళ్ల స్థలాలు పంచుతామని హెచ్చరించారు.

కులాల మధ్య చిచ్చు పెట్టడానికే వర్గీకరణ

రుద్రూర్: దళితులు కలిసి మెలిసి ఉండడాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహించలేక పోతోందని, కులాల మధ్య చిచ్చు పెట్టడానికి వర్గీకరణ చేస్తున్నారని మాలమహానాడు ఉమ్మడి మండల కమిటీ నాయకులు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ తీర్పునకు నిరసనగా బుధవారం కోటగిరిలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు అధ్యక్షుడు మిర్జాపూర్ సాయన్న మాట్లాడారు. నాయకులు ఖాలే సాయిలు, పుప్పాల సైదయ్య, బ్యాగరి రాములు, జంగం సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలి

మాక్లూర్: అడవుల్లోని ఖనిజ దోపిడీ కోసం ఆదివాసీలను వెల్లగొట్టే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకుడు దుడ్డు గంగాధర్ పిలుపునిచ్చారు. ఆదివాసీల పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అమ్రాద్ తండాలో జరిగిన కార్యక్రమానికి గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తెస్తోందన్నారు.

కౌన్సిలర్ దిష్టిబొమ్మ దహనం

బోధన్: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కౌన్సిలర్ రాధాకృష్ణ దిష్టిబొమ్మను పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎంసీపీ(ఐ), ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. అనంతరం ఎంసీపీ(ఐ), ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు మాట్లాడారు. అత్యాచారం చేసిన రాధాకృష్ణను తక్షణమే కౌన్సిలర్ పదవి నుంచి తొలగించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హెచ్‌ఎంపై డీఈవోకు ఫిర్యాదు



ఎడపల్లి(బోధన్): ఠాణాకలాన్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ ఇందూర్ జిల్లా కన్వీనర్ దామ సునీల్ బుధవారం డీఈవో దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. హెచ్ఎం ప్రవర్తన దురుసుగా ఉందని, సమయపాలన పాటించడం లేదని, ఆయన ప్రవర్తన వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోవడానికి కూడా హెచ్ఎం కారణమని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. చైన్ సిస్టం పేరుతో రూ. 2 వేలు కడితే రూ.50 వేలు సంపాదించవచ్చని గతంలో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో దుర్గాదాస్, బాలకృష్ణ, మహేష్, శ్రీకాంత్ ఉన్నారు. ఇకపై హెచ్ఎం, ఠాణాకలాన్ పాఠశాలకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈవో రామారావు తెలిపారు.

అధ్వానంగా ఆర్టీసీ కాలనీ



మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ శివారులోగల ఆర్టీసీ కాలనీలో అంతర్గత రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ కాలనీ 2019లో నిజామాబాద్ నగర మున్సిపల్‌లో విలీనం అయింది. దీంతో ప్రత్యేక నిధులతో కాలనీ అభివృద్ధి చెందుతుందని భావించిన కాలనీ ప్రజలకు నిరాశే మిగిలింది. కాలనీలోని అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు కంపుకొడుతూ మురికి వాడను తలపిస్తున్నాయి. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్‌నంబర్ 4, 3, 5,7,1 లలో మురుగుకాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. మురుగునీరు రోడ్డుపై పారుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..

కాలనీలో నెలకొన్న సమస్య ల విషయమై స్థానిక కార్పొరేటర్ దృష్టికి పలుసార్లు తీసుకెళ్లినా ఫలితం లేదు. డ్రెయినేజీల్లో పిచ్చిమొక్కలు పెరిగి పోవడంతో నీటిపారకం నిలిచిపోతుంది. దీంతో మురుగునీరు రహదారులపై పారుతుంది. రహదారులు అధ్వానంగా మారాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. – రాజేందర్, ఆర్టీసీ కాలనీ అధ్యక్షుడు

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఎడపల్లి(బోధన్): ఎన్నికల సమయంలో చెప్పినట్లు పింఛన్ రెట్టింపు చేయాలని, ఇళ్లు లేనివారికి స్థలం కేటాయించి రూ.5 లక్షలు నిర్మాణానికి ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎడపల్లి తహసీల్ కార్యాలయం ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ధన్వాలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథా మండల కార్యదర్శి గుమ్మల గంగాధర్ మాట్లాడారు. అందరికీ రుణమాఫీ చేయాలన్నారు. మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత కార్మిక దినోత్సవం



రుద్రూర్‌లో చేనేత కార్మికులకు సన్మానం

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమానికి పలు పథకాలను ప్రవేశపెట్టిందని, వీటిని కార్మికులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలోకి రావాలని చేనేత సహకార సంఘం నాయకులు కోరారు. అలాగే చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి తోడ్పడాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బాల్కొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లను విరివిగా పెంచాలనే లక్ష్యంతో కేసీఆర్ హరితహారం ఎప్పుడో ప్రారంభించారన్నారు. అందుకే పదేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఏపీవో ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష సమావేశం..


బాల్కొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందని వారు పడుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదైన ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుధ్యం పడకేయడం వల్ల విష జ్వరాలు సోకుతున్నాయని, కేజీబీవీ అద్దె భవనంలో కొనసాగుతుందని, దీంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాయన్ (తెలుగు) – 12.15, 7.10 కల్కి 2898 ఏడీ (తెలుగు) - 3.25, 10.20
స్క్రీన్-2 –	డెడ్‌పూల్ 3డీ (తెలుగు)- 10.00, 4.00, 10.00, బడ్డీ (తెలుగు) 1.00, 7.00
స్క్రీన్-3 –	యావరేజ్ స్టూడెంట్ నాని (తెలుగు) - 1.45, -తిరగబడర సామీ (తెలుగు) 7.20,- రాయన్ (తెలుగు) 10.30
స్క్రీన్-4 –	శివం భజే (తెలుగు) - 11.00, 1.45 7.35, 10.20, ఉషా పరిణయం (తెలుగు) 4.30

సంక్షిప్తం

నేడు జీపీ కార్మికుల సమ్మె

వర్ని: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జీపీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నేసాబ్ వెల్లడించారు. సమ్మెకు సంబంధించిన నోటీసును బుధవారం వర్ని ఎంపీవో మారుతికి అందజేశారు.

వర్షానికి కూలిన ఇల్లు

వేల్పూర్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్తపల్లి(ఎస్) గ్రామంలో మామిడి భాస్కర్ అనే వ్యక్తి ఇల్లు బుధవారం కూలిపోయింది. ఈ కారణంగా సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఉద్యోగులకు ధ్యానం, ఆత్మ జ్ఞానంపై అవగాహన

ఆర్మూర్‌టౌన్: పట్టణ కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘంలో బుధవారము ఆత్మజ్ఞానం, ధ్యానం ద్వారా పొందే లాభాలపై విశ్రాంత ఉద్యోగులకు డాక్టర్ పి. వెంకటరమణ అవగాహన కల్పించారు. దేహమే దేవాలయమని జీవుడే సనాతన దైవమని ఆయన అన్నారు. విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడికి కన్నీటి వీడ్కోలు

బోధన్: పట్టణ కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యకారుడు, ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడు కొట్టూరు నర్సింహులు(75) అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. బుధవారం గాంధీనగర్ కాలనీలోని ఆయన స్వగహంలో అంతిమ సంస్కారాలు జరిగాయి. పట్టణ ప్రముఖులు, నాయకులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, జర్నలిస్టులు ఘనంగా నివాళులర్పించారు.

ఆర్మూర్– రహత్‌నగర్ బస్సు ప్రారంభం

భీమ్‌గల్: ఆర్మూర్ నుంచి రహత్‌నగర్‌కు నూతన బస్సు సర్వీస్‌ను బుధవారం ప్రారంభించినట్లు ఆర్మూర్ డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు.

క్షత్రియలో నమూనా ఎన్నికలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ పాఠశాలలో బుధవారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. కళాశాల యజమానులు అల్జాపూర్ గంగాధర్, అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. నమూనా ఎన్నికలు వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు ఎన్నికల నిర్వహణపై అవగాహన కలుగుతుందన్నారు. ప్రిన్సిపల్ లక్ష్మీ నర్సింహ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జెండా బాలాజీ జాతర

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెండాగల్లీలో గల వేంకటేశ్వర ఆలయ ఆవరణలో ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో సర్వసమాజ్ ఆధ్వర్యంలో జెండా బాలాజీ జాతర ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జెండాను ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. 15న జెండాజాతర ఉంటుంది. అధ్యక్షుడు ఆకుల రాజు, కార్యదర్శి కర్తన్ దినేష్, ఉపాధ్యక్షుడు భూపేందర్, సర్వసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.